www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | సోమవారం, అక్టోబర్ 19.2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:230 | పేజీలు: 8 | వెల: రూ.5/-

అహోబిలంలో భారీ అగ్నిప్రమాదం

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ ప్రమాదంలో ఆరు దుకాణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రధాన ఆలయానికి ఎదురుగా ఉన్న బీగల ఆంజనేయస్వామి గుడికి వెళ్లే మార్గంలో ఈ ఘటన చోటుచేసుకుంది.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో మూడు బొమ్మల దుకాణాలు, ఒక శీతల పానీయాల దుకాణం, రెండు హోటళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధితుల అంచనా ప్రకారం సుమారు రూ.50 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమీపంలోని హోటళ్లలో ఉన్న గ్యాస్ సిలిండర్లను సకాలంలో బయటకు తరలించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ఒక్కరికి కూడా కొలువు చూపని ప్రభుత్వం

- జర్మనీ ఉద్యోగాల పేరిట టోమ్‌కామ్ భారీ మోసానికి పాల్పడిందన్న హరీశ్ రావు
- 70 మంది యువకుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు
- రెండేళ్లు గడిచినా ఒక్కరికీ ఉద్యోగం రాలేదని, ఇంటర్వ్యూ కూడా జరగలేదని ఆరోపణ

ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు: టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్‌సామాన్యుడి అస్త్రం



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టోమ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70-75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. పేద రైతు కుటుంబాలకు చెందిన వారు తమ ఇంట్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఈ డబ్బు కట్టారని, రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇంకా వడ్డీలు చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రెండేళ్లు దాటినా, బాధితుల్లో ఒక్కరిని కూడా ఒక్క జర్మన్ కంపెనీ కూడా ఇంటర్వ్యూ చేయలేదని హరీశ్ రావు తెలిపారు. జర్మన్ భాషలో బీ1 పరీక్ష పాసైన వారిని, ఇప్పుడు బీ2 పాస్ కావాలని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వీరిలో తొమ్మిది మంది జర్మనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారంటూ టోమ్‌కామ్ ప్రచారం చేసుకున్నా, ఒక్కరు కూడా వెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏదైనా వివాదం తలెత్తితే 1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టులో తేల్చుకోవాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. టోమ్‌కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని ఆర్టీఐ ద్వారా అడిగినా, గడువు ముగిసినా సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు.బాధితులు రెండేళ్లుగా ఎదురుచూస్తుంటే, ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగ హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్ రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు.ఈ మోసానికి పాల్పడిన టోమ్‌కామ్, ఫెయిర్‌స్టీట్ ఇండియా సంస్థల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

➤ మిగతా 2వ పేజీలో..



రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

- ట్యాంక్‌బండ్‌పై 700 మంది కళాకారుల ప్రదర్శనల నడుమ హోరెత్తిన ఉత్సవం
- బతుకమ్మ ఆడిన గవర్నర్ సతీమణి జానకి, మంత్రి సీతక్క, సినీనటులు రష్మిక, విజయ్

కమ్మని సద్దులు హద్దే లేని ఆటపాటలు

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

సూర్యుడు పడమట వాలుతుండగా ఆ నారింజ రంగుతో కూడిన చల్లని హాయి అయిన మలిసంధ్యకు మరింత అందాన్ని తెచ్చేలా.. తీరొక్క రంగులతో బతుకమ్మలు ఇళ్లలోంచి వీధుల్లోకొచ్చి ఓ చోట చక్కగా అలికి పరిచిన ముగ్గులపై కొలువుతీరాయి. వాటి చుట్టూ పట్టు పరికిణీలు, పట్టు చీరల్లో నగల ధగధగలు, గాజుల గలగలతో యువతులు, మహిళలు చేరి ఆడిపాడారు. ఉయ్యాలో ఉయ్యాల అంటూ వారు అందుకున్న పాటలకు, కోలాటాల సందడికి, డీజేల మోతకు వీధులు హోరెత్తిపోయాయి. చీకట్లు కమ్ముకుంటుండగా మహిళలంతా బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేసి.. ఒడ్డున కూర్చుని సద్దులు తిని.. పాటలు పాడుకుంటూ ఇళ్లకు కదిలారు.ఆదివారం సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా పల్లె, పట్నం అన్న తేడా లేకుండా ఇలా సంప్రదాయరీతిలో సద్దుల బతుకమ్మ సంబురాలు కన్నుల పండుగగా జరిగాయి! ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై పెద్ద బతుకమ్మ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. విద్యుద్దీపాల అలంకరణల నడుమ పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యకారులు సహా 700 మంది కళాకారుల ప్రదర్శనలు, హుస్సేన్ సాగర్ అలలపై లేజర్ షో, తారాజువ్వలు దూసుకెళ్లడాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలకు గవర్నర్ శివప్రసాద్ శుక్లా, ఆయన సతీమణి జానకీ శుక్లా, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి, మరో మంత్రి సీతక్క, ప్రముఖ సినీనటులు, కొత్త దంపతులు అయిన విజయ దేవరకొండ, రష్మిక, సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ తదితరులు వేడుకకు హాజరయ్యారు.

➤ మిగతా 2వ పేజీలో..

ఆర్టీసీలో గెలిచినా దక్కని గుర్తింపు..

- ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల గెలుపు సర్టిఫికెట్‌పై వివాదం
- ధ్రువపత్రం జారీలో కార్మిక శాఖ జాప్యం చేస్తోందని జేఏసీ విమర్శ
- ఎన్నికల మొదట్నుంచీ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపణ



హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

టీజీఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన తమకు ధ్రువీకరణ పత్రం (విక్టరీ సర్టిఫికెట్) అందజేయడంలో కార్మిక శాఖ జాప్యం చేస్తోందని టీజీఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆరోపించింది. ఎన్నికల్లో గెలుపొందిన తమకు వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ నేతలు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఇటీవల జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ)లతో కూడిన జేఏసీ కూటమి ఘన విజయం సాధించింది.

➤ మిగతా 2వ పేజీలో..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమాయత్తం కావాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం)

: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమాయత్తం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలన్నారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై సన్నాహక సమావేశం జరిగింది. ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్క కొమురయ్యలతో పాటు రెండు ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నేతలు, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ..

- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు

అమరావతి, సామాన్యుడి అస్త్రం

తిరుమల పుణ్యక్షేత్రం భక్తులతో పోటెత్తింది. శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. టోకెన్ రహిత సర్వదర్శనం కోసం వేచి ఉన్న భక్తుల క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్ హౌస్ వరకు చేరుకుంది.ఈ ఉదయం 8 గంటల సమయానికి క్యూలో ఉన్న భక్తులకు స్వామివారి సర్వదర్శనం లభించడానికి సుమారు 12 నుంచి 13 గంటల సమయం పట్టవచ్చని టీటీడీ అధికారులు అంచనా వేస్తున్నారు.



➤ మిగతా 2వ పేజీలో..

చెన్నైకి రెడ్ అలర్ట్

- అతి భారీ వర్షాల నేపథ్యంలో చెన్నైకి రెడ్ అలర్ట్ జారీ
- చెంగల్పట్టు, తిరువళ్లూరు సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

న్యూఢిల్లీ, సామాన్యుడి అస్త్రం

తమిళనాడును భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా రాజధాని చెన్నైలో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో నగరవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నైతో పాటు చెంగల్పట్టు, తిరువళ్లూరు, నీలగిరి, కోయంబత్తూరు, తేని జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' ప్రకటించారు.



➤ మిగతా 2వ పేజీలో..

ముంబైలో తీవ్ర కలకలం

- ముంబై జుహులో బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పులు
- దాడి నుంచి సురక్షితంగా బయటపడ్డ టైగర్, ఆయన డ్రైవర్‌కు గాయాలు

న్యూఢిల్లీ, సామాన్యుడి అస్త్రం

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారుపై కాల్పుల ఘటన ముంబైలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఆదివారం సాయంత్రం జుహు ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.



పండగ పూట ఛార్జీల బాదుడు

- పండగ స్పెషల్ బస్సుల ఛార్జీల పెంపుపై హరీశ్ రావు విమర్శలు
- సాధారణ బస్సులనే స్పెషల్స్‌గా నడుపుతూ అధిక ఛార్జీలు వసూలు

స్పెషల్ బస్సులపై 50 శాతం సర్‌ఛార్జి మాత్రమేనంటున్న టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

బతుకమ్మ, దసరా పండగల వేళ తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పండగకు సొంతూళ్లకు వెళ్లేవారి ఉత్సాహాన్ని ఈ ఛార్జీల పెంపు దెబ్బ తీసిందని ఆయన ఆరోపించారు. ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.సాధారణ సర్వీసులను తగ్గించి, వాటినే పండగ స్పెషల్ బస్సులుగా చూపిస్తూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు సాధారణ టికెట్ ధర రూ. 230 ఉండగా, ఇప్పుడు రూ. 400 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ. 220 ఉన్న టికెట్‌ను రూ. 290కి పైగా పెంచారని తెలిపారు. ఇదేనా మీ ప్రజాపాలన? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అయితే, ఈ ఛార్జీల పెంపు కేవలం పండగ రద్దీ కోసం నడుపుతున్న 7,000 ప్రత్యేక బస్సులకు మాత్రమే వర్తిస్తుందని టీజీఎస్ఆర్టీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథంగానే ఉన్నాయని తెలిపాయి. పండగ సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన తర్వాత బస్సులు ఖాళీగా తిరిగి రావడం వల్ల అయ్యే నిర్వహణ ఖర్చులను భర్తీ చేసేందుకు ఈ 50 శాతం సర్‌ఛార్జి విధిస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు.



➤ మిగతా 2వ పేజీలో..

ఒక్కరికి కూడా కొలువు చూపని ప్రభుత్వం

మొదటి పేజి తరువాయి

ఇచ్చారో ఆర్టీఐ ద్వారా సమాచారం అడిగినా, చట్టబద్ధమైన గడువు దాటినా ప్రభుత్వం సమాధానం ఇవ్వకపోవడం శోచనీయమని విమర్శించారు. బాధితులు న్యాయం కోసం ఏడుస్తుంటే, కార్మికశాఖ మంత్రి మాత్రం మొన్న జూన్‌లో మరో కొత్త బ్యాచ్‌ను ప్రారంభిస్తూ ఉద్యోగాలంటూ మాయమాటలు చెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇస్తామన్న 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?, మీరిచ్చిన జాబ్ క్యాలెండర్ ఎటుపోయింది రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు.టామ్‌కామ్ వసూలు చేసిన ప్రతి పైసాను బాధితులకు వెంటనే వాపస్ ఇవ్వాలని, రెండేళ్ల విలువైన కాలం వృథా చేసినందుకు, తెచ్చిన అప్పుల వడ్డీల భారం, మానసిక క్షోభకు గురిచేసినందుకు ఒక్కో అభ్యర్థికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మోసపోయిన బాధితులందరికీ ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలన్నారు. టామ్‌కామ్ కుంభకోణంపై వెంటనే సీఐడీ లేదా న్యాయ విచారణ జరిపించి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు.ఇప్పటివరకు ఎంత ఫీజు వసూలు చేశారు? ఎంతమందికి విదేశీ ఉద్యోగాలు ఇచ్చారో ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ కుటుంబాలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడుతుందని హెచ్చరించారు. నారాయణఖేడ్ నియోజకవర్గం, పలుగు తండాకు చెందిన ఉద్యమకారులు, నిరుపేద రైతు కూలీలైన వాడిత్య యాదు నాయక్, పాపీబాయి దంపతుల కుమార్తెలు వాడిత్య నివేదిత, వాడిత్య అఖిల ఇద్దరూ డాక్టర్లు కావడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. వారు ఎంబీబీఎస్ సీట్లు సాధిం చి కుటుంబ సమేతంగా వచ్చి నన్ను కలవడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు.పేదరికం ప్రతిభకు అడ్డంకి కారాదనే బలమైన సంకల్పంతో మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ వ్యాప్తంగా వందలాది గురుకులాలను ఏర్పాటు చేసి కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించారని గుర్తు చేశారు. దానికితోడు జిల్లాకో మెడికల్ కాలేజీని నెలకొల్పి



రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లను 2,850 నుంచి 10,000 పైచిలుకు పెంచిన విప్లవాత్మక నిర్ణయం నేడు క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలను ఇస్తోందనానరు. నాడు తెలంగాణ పోరాటంలో పిడికిలెత్తిన ఉద్యమకారుల బిడ్డలు.. నేడు కేసీఆర్ విద్యా సంస్కరణల ఫలితంగా స్టెతస్కోప్ పట్టుకొని సమాజ సేవకు సిద్ధమవుతుండటం గర్వకారణమని పేర్కొన్నారు. నివేదితకు, అఖి భవిష్యత్తులో ఉన్నత వైద్యులుగా ఎదిగి, పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

మొదటి పేజి తరువాయి

బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనాలని పెళ్లప్పుడే ర ష్మికకు చెప్పా.. తీసుకొచ్చా: విజయ్

నేను తెలంగాణ కోడలిని.. అందుకే బతుకమ్మ ఆడేందుకు వచ్చా: రష్మిక

కులమతాలకు అతీతంగా ప్రజలను ఒకచోటకు చేర్చే పండుగ: మంత్రి జూపల్లి

రంగురంగుల పూలను ఒకచోటకు చేర్చి.. ఆ పూలతోనే అమ్మవారిని కొలిచే గొప్ప పండుగ.. కుల, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒక చోటకు చేర్చి ఐకమత్యంగా ఉండాలనే సందేశాన్నిచ్చే వేడుక బతుకమ్మ అని జూపల్లి పేర్కొన్నారు. చెరువులు, చేలను పరిరక్షించుకోవాలనే సందేశాన్నిచ్చే పండుగ బతుకమ్మ అని సీతక్క అన్నారు. బతుకమ్మ ఆడటం ద్వారా ఆరోగ్యం బాగుంటుందని, ఆ రకంగా ఇది ఆరోగ్యాన్ని పరిరక్షించే పండుగ అని వివరించారు. అనంతరం విజయ్ దేవరకొండ మాట్లాడారు. తనకు తెలంగాణ పండుగలు అంటే ఎంతో ఇష్టం అని.. అందులోనూ బోనాలు, బతుకమ్మ పండుగలంటే మరీ ఇష్టం అని చెప్పారు. ఫిబ్రవరిలో తమకు వివాహం జరిగిందని, తెలంగాణ పండుగల్లో



ఒకటైన పెద్ద బతుకమ్మ పండగ ఎక్కడ జరిగితే అక్కడ బతుకమ్మ ఆడాలని రష్మికకు అప్పట్లోనే తాను చెప్పానని వెల్లడించారు. ఆ ప్రకారంగానే రష్మికను ట్యాంక్‌బండ్‌పై వేడుకల్లో బతుకమ్మను ఆడించేందుకు తీసుకొచ్చానని చెప్పారు.అనంతరం రష్మిక మాట్లాడారు. తాను తెలంగాణ కోడలినని, ఆ రకంగా రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాల్లో పాలు పంచుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. పెళ్లయ్యాక.. తెలంగాణలో జరిగే అతిపెద్ద బతుకమ్మ పండగలో పాల్గొని బతుకమ్మ ఆడాలని విజయ్ తనకు చెప్పారని అందుకే ఈ బతుకమ్మ ఉత్సవాలకు తాను హాజరయ్యానని చెప్పారు. అప్పట్లో తనను అంతా మేడం అని పిలిచేవారని, తెలంగాణ కోడలినయ్యాక అంతా వదినా అని పిలుస్తున్నారని.. తన పట్ల ఈ అభిమానం ఎప్పటికీ ఇలానే ఉండాలని పేర్కొన్నారు. గవర్నర్ సతీమణి జానకీ శుక్లా, మంత్రి సీతక్క, రష్మిక బతుకమ్మ ఆడారు. హనుమకొండలో పద్మాక్షి ఆలయం వద్ద జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో వేలసంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.వరంగల్‌లోని పోతన ఆడిటోరియం, ప్రసిద్ధ భద్రకాళి ఆలయ ప్రాంగణం, ఉర్సూ కరీమాబాద్‌లోని రంగలీలా మైదానం, వరంగల్ కోట, కాజీపేటలోని వడ్డెపల్లి చెరువుకట్ట, కాశీబుగ్గలోని కోటి లింగాల దేవాలయ ప్రాంగణం వద్దా బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి కొండా సురేఖ హనుమకొండ రాంనగర్‌లో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. నిజామాబాద్ జిల్లా బోర్గాంలో బతుకమ్మ ఆడుతుండగా ఆ వైపు అంబులెన్స్ రావడంతో మహిళలు బతుకమ్మలను పక్కకు తీసి అంబులెన్స్‌కు దారి ఇచ్చి తమ బాధ్యతను చాటుకున్నారు.

ఆర్టీసీలో గెలిచినా దక్కని గుర్తింపు..

మొదటి పేజి తరువాయి

అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి అనేక రోజులు గడుస్తున్నా కార్మిక శాఖ అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా అనవసరంగా ఆలస్యం చేస్తున్నారని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే కార్మిక శాఖ అధికారులు తమకు అడ్డంకులు సృష్టిస్తున్నారని జేఏసీ నేతలు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెంటనే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది. కార్మిక శాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగానే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని నేతలు స్పష్టం చేశారు.



తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ..

మొదటి పేజి తరువాయి

సర్వదర్శనానికి 12 నుంచి 13 గంటల సమయం

రూ.300 ప్రత్యేక దర్శనానికి 3 నుంచి 5 గంటలు

శనివారం 83 వేల మందికి పైగా శ్రీవారి దర్శనం

అలాగే, రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 నుంచి 5 గంటల సమయం పడుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలో వేచి ఉన్న వారికి టీటీడీ సిబ్బంది తాగునీరు, అన్నప్రసాదాలను నిరంతరం పంపిణీ చేస్తూ తగిన ఏర్పాట్లు చేశారు.నిన్న (శనివారం) శ్రీవారిని మొత్తం 83,806 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 34,449 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.17 కోట్లు వచ్చినట్లు టీటీడీ వెల్లడించింది. అలాగే, నిన్న ఒక్కరోజే 4.73 లక్షల లడ్డూలు విక్రయించగా,



2.41 లక్షల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు 8,353 మంది భక్తులు ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు.

చెన్నైకి రెడ్ అలర్ట్..


మొదటి పేజి తరువాయి

ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో

తమిళనాడులో కుండపోత వానలు

చెన్నై, శివారు ప్రాంతాల్లో అనేక కాలనీలు జలమయం

మరో 26 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.శనివారం కురిసిన భారీ వర్షాలకు చెన్నై మహానగరంతో పాటు శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని నివాసగృహాల్లోకి వరద నీరు చేరగా, రహదారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. అధికార యంత్రాంగం స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, మోటార్ పంపుల సాయంతో వరద నీటిని తొలగించే పనులను వేగవంతం చేసింది. అక్టోబరు 15న ప్రారంభమైన ఈశాన్య రుతుపవనాల ప్రభావంతోనే ఈ స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు.భారీ వర్షాల నేపథ్యంలో పాఠశాలలకు సెలవుల ప్రకటనపై విద్యార్థులు, తల్లిదండ్రులలో సందిగ్ధత నెలకొంది. దీనిపై విద్యాశాఖ మంత్రి రాజ్‌మోహన్ స్పందిస్తూ.. వాతావరణ శాఖ నివేదికల ఆధారంగా పాఠశాలల సెలవులపై ఎప్పటికప్పుడు సమీక్షించి, సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.



పండగ పూట ఛార్జీల బాదుడు.



మొదటి పేజి తరువాయి

2003లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో ఎంఎస్ నెం. 16) ప్రకారమే ఈ సర్ఛార్జిని వసూలు చేస్తున్నామని, ఇది కొత్త విధానం కాదని టీజీఎస్ఆర్టీసీ చెబుతోంది. అయినప్పటికీ, పండగ వేళ ఛార్జీల పెంపు సరైంది కాదని ప్రతిపక్షాలు విమర్శిస్తుండటంతో ఈ అంశంపై రాజకీయంగా చర్చ మొదలైంది.

ముంబైలో తీవ్ర కలకలం



మొదటి పేజి తరువాయి

దాడికి బాధ్యత వహిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్

నిందితుల కోసం 12 బృందాలతో గాలింపు చేపట్టిన ముంబై పోలీసులు

వివరాల్లోకి వెళితే, ఆదివారం సాయంత్రం ఫుట్‌బాల్ ఆడి తన బీఎండబ్ల్యూ కారులో ఇంటికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. జుహు పోలీస్ స్టేషన్ పరిధిలోని పుష్పా పార్క్ సమీపంలోకి రాగానే, మోటార్‌సైకిల్‌పై వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఆయన కారును లక్ష్యంగా చేసుకుని మూడు నుంచి ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉండగా, ఆయన కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నానావతి ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో సమీపంలో ఉన్న ఒక ఆటో డ్రైవర్‌కు కూడా గాయాలైనట్లు సమాచారం.ఘటన గురించి తెలియగానే ముంబై పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. డీసీపీ మోహిత్ గార్గ్ సహా ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించారు. టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకోవడానికి దాదాపు 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.ఇదిలా ఉండగా, ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు విదేశాల్లో ఉంటున్న గ్యాంగ్‌స్టర్లు అనిల్ పండిట్, హర్మన్ సంధులు సోషల్ మీడియాలో ప్రకటించారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ తరఫున ఈ పోస్ట్ పెట్టినట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్‌తో పనిచేసే వారిని లక్ష్యంగా చేసుకుంటామని గతంలోనే హెచ్చరించామని, అందులో భాగంగానే ఈ దాడి జరిగిందని వారు పేర్కొన్నట్లు సమాచారం. అయితే, ఈ సోషల్ మీడియా పోస్టును ముంబై పోలీసులు ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: రాంచందర్‌రావు

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. అభ్యర్థి ఎవరన్న దానితో సంబంధం లేకుండా పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రతి ఒక్కరూ ప్ర త్యేక దృష్టి సారించాలని సూచించారు. పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడంతో పాటు పోలింగ్ రోజున వారు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా కార్యకర్తలు చొరవ చూపాలన్నారు. బీజేపీ పట్ల విద్యావంతులు, గ్రాడ్యుయేట్లలో బలమైన సానుకూలత ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



యాంటీ డ్రోన్ పరికరాల సంస్థలో భారీ అగ్నిప్రమాదం!..

బ్యాటరీలు వేడెక్కడమే కారణమా?

- మాదాపూర్‌లోని యూనిస్టింగ్ టెక్ సొల్యూషన్స్‌లో చెలరేగిన మంటలు
- మూడు అగ్నిమాపక వాహనాలతో మంటలు అదుపులోకి.. తప్పిన ప్రాణనష్టం
- విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కూలింగ్ వ్యవస్థ ప్రభావితమైందని అనుమానం



సామాన్యుడి అస్త్రం / మాదాపూర్ :

యాంటీ డ్రోన్ వ్యవస్థలకు సంబంధించిన అత్యాధునిక పరికరాలను అభివృద్ధి చేసే యూనిస్టింగ్ టెక్ సొల్యూషన్స్ సంస్థలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సాయంత్రం 5 గంటల సమయంలో సంస్థ ప్రాంగణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని మాదాపూర్ పోలీసులు వెల్లడించారు. అయితే ఆస్తినష్టం ఎంత జరిగిందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

విద్యుత్ సరఫరా నిలిచిపోవడమే కారణమా?

అగ్నిప్రమాదానికి విద్యుత్ సరఫరాలో అంతరాయమే కారణమై ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కారణంగా సంస్థలోని పరికరాలకు సంబంధించిన కూలింగ్ వ్యవస్థ పనితీరు ప్రభావితమై, బ్యాటరీలు అధికంగా వేడెక్కి మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే బ్యాటరీల వల్లే అగ్నిప్రమాదం జరిగిందని ఇప్పుడే నిర్ధారించలేమని, సమగ్ర పరిశీలన తర్వాతే అసలు కారణం వెల్లడవుతుందని పోలీసులు పేర్కొన్నారు.

దర్యాప్తు తర్వాతే అసలు కారణంపై స్పష్టత!

రక్షణ రంగానికి సంబంధించిన యాంటీ డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం, ఎలక్ట్రానిక్ పరికరాల అభివృద్ధిలో పనిచేస్తున్న సంస్థలో ఈ ప్రమాదం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రమాదంలో ఎలాంటి పరికరాలు దెబ్బతిన్నాయి, బ్యాటరీలకే మంటలు పరిమితమయ్యాయా, విద్యుత్ అంతరాయం సమయంలో కూలింగ్ వ్యవస్థకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉన్నాయా, అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అగ్నిప్రమాదానికి గల కారణాలు, ఆస్తినష్టం వివరాలు పూర్తిస్థాయి తనిఖీ అనంతరం వెల్లడయ్యే అవకాశముంది. ఈ మేరకు మాదాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ప్రమాద వివరాలను తెలియజేశారు.

నీటి వృథాకు భారీ మూల్యం!..

ఫోర్‌ఫాదర్స్ పబ్‌కు రూ.20 వేల జరిమానా!

- జూబ్లీహిల్స్‌లో జలమండలి కొరడా.. తాగునీటి కనెక్షన్ కట్, ట్యాంకర్ల సరఫరాకూ బ్రేక్!
- తాగునీటితో పబ్ ప్రాంగణం శుభ్రం చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తింపు
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు.. రూ.20 వేల జరిమానా విధింపు
- హోటళ్లు, పబ్‌లు, వాణిజ్య సంస్థలకు జలమండలి హెచ్చరికలు





సామాన్యుడి అస్త్రం / జూబ్లీహిల్స్ :

తాగునీటిని ఇష్టానుసారంగా వృథా చేస్తే చర్యలు తప్పవని హైదరాబాద్ జలమండలి మరోసారి స్పష్టం చేసింది. జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రముఖ పబ్‌పై అధికారులు కొరడా ఝుళిపించారు. రోడ్ నంబర్ 45లోని ఫోర్‌ఫాదర్స్ పబ్ యాజమాన్యం తాగునీటిని దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించి ఏకంగా రూ.20 వేల జరిమానా విధించారు. అంతటితో ఆగకుండా పబ్‌కు ఉన్న తాగునీటి కనెక్షన్‌ను తొలగించడంతోపాటు జలమండలి ఫిల్లింగ్ స్టేషన్ నుంచి వాణిజ్య ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను నిలిపివేశారు. ఆదివారం (అక్టోబర్ 18) ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడైంది.

ఫిర్యాదుతో బయటపడిన నీటి వృథా!

జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని రోడ్ నంబర్ 45, ప్లాట్ నంబర్ 872లో ఫోర్‌ఫాదర్స్ పబ్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ తాగునీటిని అవసరానికి మించి వినియోగిస్తూ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్నారనే ఫిర్యాదు జలమండలి అధికారులకు అందింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు పబ్ ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించారు. నీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు నిర్ధారించుకున్న అనంతరం యాజమాన్యంపై చర్యలు తీసుకున్నారు. తాగునీటిని ఇతర అవసరాలకు విచ్చలవిడిగా వాడటాన్ని ఉపేక్షించబోమని అధికారులు స్పష్టం చేశారు.

జరిమానాతో సరిపెట్టలేదు..

సాధారణంగా నీటి వృథా వ్యవహారాల్లో జరిమానాలు విధించే జలమండలి, ఈసారి పబ్‌కు నీటి సరఫరాను కూడా నిలిపివేయడం చర్చనీయాంశమైంది. పబ్‌కు ఉన్న తాగునీటి కనెక్షన్‌ను తొలగించిన అధికారులు, జలమండలి ఫిల్లింగ్ స్టేషన్ నుంచి వాణిజ్య ట్యాంకర్ల సరఫరాను సైతం నిలిపివేశారు. నిబంధనలు ఉల్లంఘించే వాణిజ్య సంస్థల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామనే సంకేతాన్ని ఈ చర్యల ద్వారా ఇచ్చారు.

నీళ్ల సరఫరాకూ బ్రేక్!

నగరంలో నీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని జలమండలి కోరింది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఇతర వాణిజ్య సంస్థలు తాగునీటిని అనవసరంగా వృథా చేయవద్దని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతోపాటు నీటి కనెక్షన్ల తొలగింపు వంటి కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది.

హోటళ్లు, పబ్‌లూ జాగ్రత్త..!

నగరంలో నీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని జలమండలి కోరింది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఇతర వాణిజ్య సంస్థలు తాగునీటిని అనవసరంగా వృథా చేయవద్దని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతోపాటు నీటి కనెక్షన్ల తొలగింపు వంటి కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తా!

- జనసేన నాయకురాలు, ప్రముఖ న్యాయవాది పిప్పళ్ళ సుప్రజ
- నరసాపురం మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు అండగా ప్రచారం
- ప్రతి వార్డులోనూ అభ్యర్థుల తరపున విస్తృత ప్రచారానికి సిద్ధం
- ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్న సుప్రజ

సామాన్యుడి అస్త్రం / నరసాపురం :

రాబోయే నరసాపురం మున్సిపల్ ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమి మద్దతుతో బరిలో నిలిచే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని జనసేన పార్టీ నాయకురాలు, ప్రముఖ న్యాయవాది, సామాజిక సేవకురాలు పిప్పళ్ళ సుప్రజ స్పష్టం చేశారు. శనివారం (అక్టోబర్ 17) నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్‌తోపాటు కౌన్సిలర్ అభ్యర్థుల విజయానికి జనసేన పార్టీ తరపున తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కూటమి అభ్యర్థుల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటూ ప్రజలతో మమేకమవుతానని పేర్కొన్నారు.

ప్రతి వార్డులోనూ ప్రచారానికి సిద్ధం!

నరసాపురం పట్టణంలోని 36 వార్డుల్లో కూటమి మద్దతుతో పోటీ చేసే అభ్యర్థులకు అండగా నిలుస్తామని సుప్రజ తెలిపారు. ఆయా వార్డుల్లో అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొంటామని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు కృషి చేస్తామన్నారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి!

మున్సిపల్ ఎన్నికల్లో కూటమిలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సుప్రజ పిలుపునిచ్చారు. వ్యక్తిగత అభిప్రాయాలకు అతీతంగా అభ్యర్థుల విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. ప్రతి వార్డులోనూ నాయకులు, కార్యకర్తలు ప్రచార బాధ్యతలను పంచుకుని ముందుకు సాగాలన్నారు. నరసాపురం మున్సిపాలిటీలో కూటమి విజయం సాధిస్తుందనే విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో తన వంతు పాత్రను సమర్థంగా నిర్వహిస్తానని పిప్పళ్ళ సుప్రజ వెల్లడించారు.



రూ.70 లక్షల పనులు.. ఎత్తు నియంత్రణ మరిచారా?



- వైశాలీనగర్ అండర్‌పాస్‌లో పైకప్పు పెచ్చులు.. భారీ వాహనాల రాకపోకలపై ఆందోళన!
- రూ.70 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు.. ఎత్తు నిరోధక బారికేడ్లు ఎందుకు ఏర్పాటు చేయలేదు?
- వాహనాల పైభాగం తగిలి పెచ్చులూడాయా?.. అసలు కారణంపై సాంకేతిక పరిశీలన అవసరం
- పైన నిత్యం రైళ్లు.. కింద వాహనాలు.. భద్రతకు శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్

సామాన్యుడి అస్త్రం / కొండాపూర్ :

వైశాలీనగర్ రైల్వే అండర్‌పాస్ వద్ద పైకప్పు అంచుల్లో కాంక్రీట్ పెచ్చులూడి, పగుళ్లు కనిపించడం ఆందోళన రేపుతోంది. అయితే ఇవి రూ.70 లక్షలతో ఇటీవల చేసిన సీసీ రోడ్డు పనుల నాణ్యత లోపం వల్లే వచ్చాయని ఇప్పుడే చెప్పలేం. అనుమతించిన ఎత్తుకంటే ఎక్కువున్న వాహనాలు అండర్‌పాస్‌లోకి వెళ్లి పైభాగాన్ని ఢీకొట్టడం వల్ల ఈ నష్టం జరిగి ఉండొచ్చన్న అనుమానం వ్యక్తమవుతోంది. నిజంగా వాహనాల ఢీకొట్టడమే కారణమా? లేక పాత నిర్మాణంలోని లోపాలున్నాయా? అనేది ఇంజినీర్ల తనిఖీలో తేలాలి.

డ్రైనేజీకి రూ.70 లక్షలు.. భద్రతను మరిచారా?

వైశాలీనగర్ నుండి హఫీజ్‌పేట్ ప్రేమ్ నగర్ మీదుగా మైహోమ్ మంగళ, కొండాపూర్‌కు వెళ్లే ఈ మార్గం, గతంలో అండర్‌పాస్ కింద బహిరంగంగా ఉన్న డ్రైనేజీని బాక్స్ డ్రెయిన్‌గా మార్చి, పైన సీసీ రోడ్డు, మార్గ విస్తరణ పనులు చేపట్టారు. ఇందుకోసం సుమారు రూ.70 లక్షల వ్యయాన్ని ప్రకటించారు. నెలల తరబడి ట్రాఫిక్ ఆంక్షల అనంతరం అక్టోబర్ 14న మార్గాన్ని ప్రారంభించారు. మూడు రోజులకే పైకప్పు వద్ద దెబ్బతిన్న భాగాలు చర్చకు వచ్చాయి. కొత్తగా నిర్మించిన డ్రైనేజీ, రోడ్డుకు.. రైల్వే నిర్మాణంలోని పాత పైకప్పుకు మధ్య తేడాను అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

ఎత్తు బారికేడ్లు పెడితే ముప్పునకు చెక్!

ఈ అండర్‌పాస్ మీదుగా నిత్యం రైళ్లు ప్రయాణిస్తుంటాయి. కింద ఎక్కువ ఎత్తున్న వాహనాలు వెళ్లి పైకప్పును తాకితే నిర్మాణానికి, ప్రయాణికుల భద్రతకు ముప్పు తలెత్తే అవకాశం ఉంది. అందుకే రెండు వైపులా అనుమతించిన ఎత్తును తెలిపే బోర్డులు, ముందుగానే వాహనాలను ఆపే ఎత్తు నిరోధక గేట్లు, రాత్రివేళ కనిపించే హెచ్చరికలు ఏర్పాటు చేయాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. వీటి ఎత్తు ఎంత ఉండాలన్నది రైల్వే, ట్రాఫిక్, మున్సిపల్ ఇంజినీర్లే నిర్ణయించాలి. ఎత్తైన వాహనాలకు ప్రత్యామ్నాయ దారి చూపాలి.

గత ప్రమాదం నుంచి పాఠం లేదా?

జూలై 28న ఇదే అండర్ పాస్ లో 70 ఏళ్ల బాలయ్య వరదనీటి నాలాలో కొట్టుకుపోయిన ఘటన గుర్తుండే ఉంది. అప్పుడూ భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు వచ్చాయి. ఇప్పుడు పైకప్పు దెబ్బతినడంపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది. రూ.70 లక్షల పనుల ప్రణాళికలో ఎత్తు నియంత్రణ ఏర్పాట్లను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు, ఇప్పటికే ఉన్నాయా, ఉంటే పనిచేస్తున్నాయా, రైల్వే, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి, నష్టం కారణాన్ని నిర్ధారించాలి. ప్రమాదం జరగకముందే రక్షణ చర్యలు తీసుకోవాలి.





పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి



- అక్రమ నిల్వలతో దాణా ధరలు విపరీతంగా పెంచుతున్నారని ఆరోపణ

- మొక్కజొన్న, సోయాబీన్ వంటి ముడిసరుకులను గోదాముల్లో దాస్తున్నారని ఆవేదన

హైదరాబాద్,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈరోజు ఆయన ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఒక ప్రకటన చేశారు.పౌల్ట్రీ పరిశ్రమకు కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్, డీఓసీ వంటి ముడిసరుకులను కొందరు స్టాకిస్టులు అక్రమంగా గోదాముల్లో నిల్వ చేస్తున్నారని బండ్ల గణేశ్ ఆరోపించారు. దీనివల్ల మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలను అమాంతం పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. "ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలి. పౌల్ట్రీ రంగానికి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలి" అని ఆయన కోరారు.ఇప్పటికే అనేక ఆర్థిక, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్న పౌల్ట్రీ రైతులకు ఈ ధరల పెరుగుదల అదనపు భారంగా మారిందని బండ్ల గణేశ్ తెలిపారు. సంబంధిత అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, రైతులకు సరసమైన ధరలకు, సకాలంలో ముడిసరుకులు అందేలా చూడాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ పౌల్ట్రీ రైతుల తరఫున తాను ఈ విజ్ఞప్తి చేస్తున్నానని, ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన అన్నారు.

పసిడి ప్రియులకు ఊరట.. తెలుగు రాష్ట్రాల్లో నేటి బంగారం, వెండి ధరలు ఇవే!

హైదరాబాద్‌లో స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు
24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.1,47,650కి చేరిక
తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఒకేలా కొనసాగుతున్న రేట్లు
కిలో వెండి ధర రూ. 2,39,900 వద్ద స్థిరంగా కొనసాగుతున్న వైనం

హైదరాబాద్,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పసిడి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. గత వారం రోజులుగా బంగారం ధర రూ. 1.5 లక్షల దిగువనే ట్రేడవుతుండగా, సోమవారం (అక్టోబర్ 19, 2026) కూడా అదే ధోరణి కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్‌లోని అస్థిరతల కారణంగా పసిడి ధరల్లో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి.'గుడ్ రిటర్న్స్' వెబ్‌సైట్ గణాంకాల ప్రకారం, సోమవారం ఉదయం హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,47,650గా నమోదైంది. అదేవిధంగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ. 1,35,340 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి ధరలో ఎటువంటి మార్పు చోటుచేసుకోలేదు. కిలో వెండి ధర రూ. 2,39,900 వద్ద స్థిరంగా ఉంది.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధర బ్యారెల్‌కు 110 డాలర్లకు చేరువ కావడం, అమెరికా–చైనా ఆర్థిక పరిణామాలు వంటి అంతర్జాతీయ అంశాలు పసిడి ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ వారం కూడా ధరల్లో ఒడిదొడుకులు ఉండవచ్చని వారు అంచనా వేస్తున్నారు.తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన వరంగల్, నిజామాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. అయితే, ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లో ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. బంగారం, వెండి ధరలు నిరంతరం మారుతుంటాయి కాబట్టి, కొనుగోలు చేసే ముందు తాజా ధరలను సరిచూసుకోవడం మంచిది.



జూబ్లీహిల్స్‌లోని 'ఫోర్ ఫాదర్స్' పబ్‌కు రూ.20 వేల జరిమానా.. కారణం ఇదే!

తాగునీటి దుర్వినియోగంపై జలమండలి కఠిన చర్యలు
జూబ్లీహిల్స్‌లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌పై చర్యలు
పబ్ వాటర్ కనెక్షన్‌ను తొలగించి, ట్యాంకర్ల సరఫరా నిలిపివేత
నీటి వృథాపై ఫిర్యాదు చేయాలని ప్రజలకు జలమండలి పిలుపు

హైదరాబాద్,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్ మహానగరంలో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టే దిశగా జలమండలి కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రముఖ పబ్‌పై భారీ జరిమానా విధించడంతో పాటు, నీటి కనెక్షన్‌ను తొలగించి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. నీటి వృథా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఈ చర్యల ద్వారా స్పష్టం చేసింది.జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో ఉన్న 'ఫోర్ ఫాదర్స్ పబ్' తాగునీటిని విపరీతంగా దుర్వినియోగం చేస్తున్నట్లు జలమండలికి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన విజిలెన్స్ అధికారులు, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. పబ్‌లో నీటిని వృథా చేస్తున్నట్లు తనిఖీల్లో నిర్ధారణ కావడంతో, యాజమాన్యానికి రూ.20 వేల జరిమానా విధించారు.అంతటితో ఆగకుండా, ఆ పబ్ తాగునీటి



కనెక్షన్‌ను శాశ్వతంగా తొలగించారు. అంతేకాక, జలమండలి ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి కమర్షియల్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను కూడా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

వేసవి దృష్ట్యా కఠిన చర్యలు.. ప్రజలకు విజ్ఞప్తి

వచ్చే ఏడాది వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకే ఈ కఠిన చర్యలు చేపట్టినట్లు జలమండలి స్పష్టం చేసింది. ప్రతి నీటి చుక్కనూ పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు వంటి వాణిజ్య సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నీటి వృథాకు పాల్పడితే ఇలాంటి చర్యలే కొనసాగుతాయని హెచ్చరించింది.నీటి సంరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని జలమండలి కోరింది. ఎక్కడైనా తాగునీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే, ఫొటోలు లేదా వీడియోలతో సహా పూర్తి వివరాలను వాట్సాప్ నంబర్ 99499 30003కు పంపాలని సూచించింది. లేదా కస్టమర్ కేర్ నంబర్ 155313కు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చింది.

త్వరలో గార్మెంట్ ఫ్యాక్టరీ ప్రారంభం



400 మందికి ఉపాధి అవకాశాలు
కుట్టు శిక్షణతో మహిళల స్వయం ఉపాధికి బాటలు
అంగన్‌వాడీ, వీవో భవనాలకు రూ.14.76 కోట్లు
భూపాలపల్లి నియోజకవర్గానికి రూ.12.58 కోట్లు మంజూరు
నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి
మంథనిలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మంథని, అక్టోబర్ 18 సామాన్యుడి అస్త్రం

మంథని ప్రాంతంలో మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యంగా త్వ రలోనే గార్మెంట్ ఫ్యాక్టరీని(ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా సుమారు 300 నుంచి 400 మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. మహిళ లు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయాల ని, ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఆదివారం మంథని పట్టణంలో ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని 302 మంది లబ్ధిదారులకు సుమారు కోటి రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అలీఫ్, డీఆర్డీఏ, మెప్మా, సీఎస్ఆర్ సంస్థల సహకారంతో కుట్టు శిక్షణ పూర్తి చేసిన 600 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 3,040 మందికి ఉచిత కుట్టు శిక్షణ అందించినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం..

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాల నే లక్ష్యంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి తెలిపారు. మంథని పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా ఇం దిరా శక్తి పథకం కింద మంజూరైన నూతన నూనె గానుగ మిల్లును ప్రారంభించారు. మ హిళలు కుట్టు శిక్షణతో పాటు పాడి పరిశ్రమ వంటి స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ మంథని నియోజకవర్గంలో అంగన్‌వాడీ, గ్రామైక్య సంఘాల భవనాల నిర్మాణానికి రూ.14.76 కోట్లు, భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో రూ.12.58 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

విద్య, వైద్యానికి మౌలిక సదుపాయాలు..

ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడాలి..

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీరు, వి ద్యుత్ వంటి వనరులను ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని మంత్రి సూచించా రు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని వనరుల సంరక్షణకు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రజలతో పాటు మంథని ప్రా ంత ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ, విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మున్సిపల్ చైర్మన్ వడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యుడు శశిభూషణ్ కాచే, ఆర్టీఏ సభ్యుడు మంథని సురేష్, కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, మాజీ ఎంపీపీ కొండా శంకర్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెండ్రు రమా సురేష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాధుల శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు

డిజిటల్ అరెస్ట్ పేరుతో భారీ మోసం: రూ. 29 లక్షలు కాజేసిన ముఠాలో ఇద్దరి అరెస్ట్

డిజిటల్ అరెస్ట్ పేరుతో రిటైర్డ్ ఉద్యోగికి మోసం
సీబీఐ, ఈడీ అధికారులమంటూ బెదిరింపులు
విడతలవారీగా రూ. 29 లక్షలు కాజేసిన కేటుగాళ్లు
మోసానికి పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు
పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు

హైదరాబాద్,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్‌లో 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరిగిన భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. 63 ఏళ్ల ఓ విశ్రాంత ఉద్యోగి నుంచి రూ. 29 లక్షలకు పైగా కాజేసిన కేసులో ఇద్దరు నిందితులను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. నగరానికే చెందిన మహమ్మద్ అష్ఫాక్ హుస్సేన్, అహ్మద్ నజీబ్ ఉద్దీన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకోగా, బెంగళూరుకు చెందిన సచిన్ అనే మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.ఈ ఏడాది మార్చి 3న బాధితుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు, తాము ఢిల్లీ పోలీసులు, సీబీఐ, ఈడీ అధికారులమని నమ్మబలికారు. రూ. 68 మిలియన్ల మనీ లాండరింగ్ కేసులో ఆయనకు ప్రమేయం ఉందని, ఆధార్ వివరాలుడ, వేలిముద్రలు దుర్వినియోగం అయ్యాయని బెదిరించారు. అరెస్ట్ చేస్తామంటూ నకిలీ పత్రాలను పంపి, ఇది జాతీయ భద్రతకు సంబంధించిన వ్యవహారమని, ఎవరికీ చెప్పకూడదని హెచ్చరించారు. దీంతో భయాందోళనకు గురైన బాధితుడు, ఆయన కుమార్తె విడతల వారీగా మొత్తం రూ. 29,17,668లను నిందితుల ఖాతాలకు బదిలీ చేశారు.నిందితులు తమ మ్యూల్ బ్యాంకు ఖాతాలను ఈ మోసానికి ఉపయోగించారని, బాధితుడి నుంచి వచ్చిన సొమ్మును విత్‌డ్రా చేసి, ఎవరికీ అనుమానం రాకుండా క్యాష్ డిపాజిట్ మెషీన్ల ద్వారా వివిధ ఖాతాల్లో జమ చేశారని అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్) ఎం. శ్రీనివాసులు తెలిపారు.

రాయచోటికి పంజాబ్, పుంగనూరుకు బెంగళూరు గ్యాంగులను తెచ్చారు: ధూళిపాళ్ల నరేంద్ర

స్థానిక ఎన్నికల్లో వైసీపీనే ఉద్దేశపూర్వకంగా గొడవలు చేస్తోందన్న నరేంద్ర
2021లో చేసిన అరాచకాలకు ఇప్పుడు మూల్యం చెల్లిస్తున్నారని వ్యాఖ్య
ఎస్ఈసీని తిట్టి మళ్లీ ఆయన దగ్గరకే వెళ్లారని జగన్‌పై విమర్శలు



అమరావతి,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో వైసీపీ ఉద్దేశపూర్వకంగానే అలజడులు సృష్టిస్తోందని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. ఈరోజు ఆయన మాట్లాడుతూ, వైసీపీ అధినేత జగన్ ని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగిపోవడం వల్లే 2024 ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని అన్నారు.

రాయచోటికి పంజాబ్ గ్యాంగ్‌ను, పుంగనూరుకు బెంగళూరు గ్యాంగ్‌ను వైసీపీనే తీసుకొచ్చిందని నరేంద్ర ఆరోపించారు. పులివెందులలో ఎంపీ అవినాశ్ రెడ్డి 200 మందితో పోలింగ్ కేంద్రానికి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. కేవలం ఐదు చోట్ల జరిగిన ఘటనలను రాష్ట్రవ్యాప్త అల్లర్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ తలుచుకుంటే వైసీపీ నామినేషన్లు కూడా వేయలేని పరిస్థితి ఉండేదని అన్నారు.పుంగనూరు, పులివెందుల, రాయచోటిలో దశాబ్దాలుగా సాగిన అణచివేత కారణంగానే ఇప్పుడు ప్రజలు వైసీపీకి వ్యతిరేకంగా తిరగబడుతున్నారని ఆయన పేర్కొన్నారు. తాడేపల్లిలో ప్రెస్ మీట్ పెట్టి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను దూషించిన జగన్, ఇప్పుడు మళ్లీ ఆయన దగ్గరకే వెళ్లారని ఎద్దేవా చేశారు. "వెయ్యి గొడ్డులు తిని నేను శాఖాహారిని అని చెప్పుకునే వ్యక్తిలా జగన్ తీరు ఉంది. తన హయాంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై నీతులు చెబుతున్నారు" అని ధూళిపాళ్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరిగాయని జగన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.అధికారంలో ఉన్నప్పుడు జగన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం ఫలితాలు రాకపోతే మంత్రి పదవులు, టికెట్లు ఉండవని సొంత పార్టీ ఎమ్మెల్యేలను, మంత్రులను బహిరంగంగానే బెదిరించారని నరేంద్రకుమార్ ఆరోపించారు. ఆ బెదిరింపుల ఫలితంగానే రాష్ట్రంలో అపూర్వమైన రీతిలో ఏకగ్రీవాలు జరిగాయని అన్నారు. "2021 ఎన్నికల్లో ఎంపీటీసీల్లో 25 శాతానికి పైగా, జెడ్పీటీసీల్లోనూ అదే స్థాయిలో ఏకగ్రీవాలు అయ్యాయి. ఒక్క కడప జిల్లాలోనే 553 ఎంపీటీసీలకు 439 (దాదాపు 80%), 50 జెడ్పీటీసీలకు 38 (78%) ఏకగ్రీవం కావడం భారతదేశ చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయం. ఇవన్నీ బెదిరింపులు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌లతో సాధించినవే," అని ఆయన గణాంకాలతో సహా వివరించారు.పులివెందుల, పుంగనూరు, ధర్మవరం, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో నామినేషన్లు వేసేందుకు వెళ్లిన టీడీపీ అభ్యర్థులపై వైసీపీ గూండాలు దాడులు చేశారని ధూళిపాళ్ల గుర్తుచేశారు. మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమ, న్యాయవాది కిశోర్‌ల కారుపై జరిగిన దాడిని ప్రస్తావించారు. "అభ్యర్థులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి, గన్ పెట్టి బెదిరించి నామినేషన్లు విత్‌డ్రా చేయించిన ఘటనలు అనేకం ఉన్నాయి. చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో ఎస్పీలను బదిలీ చేయాలని, పలమనేరు, శ్రీకాళహస్తి, పులివెందులలో డీఎస్పీలపై చర్యలు తీసుకోవాలని అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) సిఫార్సు చేసినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు" అని విమర్శించారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పైనే కులం పేరుతో బురదజల్లి, ఆయన కుటుంబాన్ని బెదిరించారని నరేంద్రకుమార్ ఆరోపించారు. ప్రాణహాని ఉందని, కేంద్ర బలగాల రక్షణ కావాలని 18.03.2020న హోం సెక్రటరీకి నిమ్మగడ్డ రాసిన లేఖను ఆయన ప్రస్తావించారు. ఆ లేఖలో 35 హింసాత్మక ఘటనలు, 23 బలవంతపు విత్‌డ్రాలు, మొదటి దశలో 55 హింసా సంఘటనలు జరిగినట్లు ఎస్ఈసీ స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. టీడీపీతో పాటు బీజేపీ, జనసేన అభ్యర్థులపైనా దాడులు జరిగాయని నివేదించారని గుర్తుచేశారు.ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పులివెందుల, పలమనేరు, రాయచోటి, పుంగనూరు వంటి ప్రాంతాల్లో వైసీపీ మళ్లీ దౌర్జన్యాలకు పాల్పడుతోందని ధూళిపాళ్ల ఆరోపించారు. "11 సీట్లకే పరిమితమైనా వారిలో మార్పు రాలేదు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అందించిన పాలన చూసి ప్రజలు మాతో నడుస్తున్నారు. ఇది చూసి ఓర్వలేక, విధ్వంసం సృష్టించి ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. 2021లో చేసిన పాపాల ఫలితాన్ని ఇప్పుడు అనుభవించబోతున్నారు. ప్రజలు గతాన్ని గుర్తుంచుకొని, ప్రజాస్వామ్యాన్ని కాపాడతారు" అని ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికలు: వైసీపీ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



స్థానిక ఎన్నికల నామినేషన్ల గడువు విషయంలో వైసీపీకి చుక్కెదురు
గడువు ముగియడంతో పిటిషన్ నిరర్థకమని తేల్చిచెప్పిన న్యాయస్థానం
నామినేషన్ల తొలిరోజు హింసాత్మకం అధికార పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని వైసీపీ ఆరోపణలు
ఘర్షణల నేపథ్యంలో ఎంపీ మిథున్ రెడ్డి సహా 70 మందిపై కేసులు

అమరావతి,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై నెలకొన్న రాజకీయ వేడి నేపథ్యంలో, వైసీపీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నామినేషన్ల దాఖలుకు గడువును పొడిగించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది.వివరాల్లోకి వెళితే, నామినేషన్ల స్వీకరణకు నిర్దేశించిన గడువు ఇప్పటికే ముగిసిపోయిందని, అందువల్ల ఈ పిటిషన్ విచారణకు అర్హత కోల్పోయిందని (నిరర్థకం) హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత తాము సాధారణంగా జోక్యం చేసుకోబోమని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో నామినేషన్ల గడువు పొడిగింపు కోసం వైసీపీ చేసిన ప్రయత్నం విఫలమైంది.మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలి రోజైన శుక్రవారం పుంగనూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు జరిగాయి. ఈ ఘటనలకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో పాటు సుమారు 70 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా, సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి పుంగనూరు పట్టణంలోకి ప్రవేశించకుండా పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు.ఈ పరిణామాలపై స్పందించిన ఎంపీ మిథున్ రెడ్డి, అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదని, అభ్యర్థుల హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

రాయచోటిలో కూటమి ప్రభంజనం..

రాయచోటి మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థుల ఏకగ్రీవ ఎన్నిక
నూతన ప్రతినిధులను అభినందించిన మంత్రి మండిపల్లి రామప్రసాద్
వైసీపీ తీరుకు ప్రజలు బదులిస్తున్నారని వ్యాఖ్య
రాజకీయాల్లో ఒత్తిళ్లకు, హింసకు చోటు ఉండకూడదని హితవు



అమరావతి,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

రాయచోటి మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు రాష్ట్ర మంత్రి మండిపల్లి రామప్రసాద్ అభినందనలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఈ నేపథ్యంలో మంత్రి రామప్రసాద్ వైసీపీ నాయకుల తీరుపై విమర్శలు గుప్పించారు. గతంలో వైసీపీ నేతలు వ్యవహరించిన తీరుకు ఇప్పుడు ప్రజలు తగిన రీతిలో బదులిస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని, దానిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.రాజకీయాల్లో హింసకు, ఒత్తిడి రాజకీయాలకు ఎంతమాత్రం తావు ఉండకూడదని మంత్రి హితవు పలికారు. ప్రజల విశ్వాసం పొందిన వారికే రాజకీయ మద్దతు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వైసీపీ మరిన్ని రాజకీయ ఎదురుదెబ్బలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే పార్టీలకే ప్రజల ఆదరణ ఉంటుందని ఆయన నొక్కిచెప్పారు.

సాలూరులో విచిత్ర రాజకీయం.. జనసైనికులకు ఊహించని షాక్..!



వైసీపీకి రాజీనామా చేయని నేతకు జనసేన టికెట్
సాలూరు చైర్‌పర్సన్ అభ్యర్థిగా గొర్లె విజయకుమారి ఎంపిక
అధిష్ఠానం నిర్ణయంపై టీడీపీ, జనసేన శ్రేణుల ఆగ్రహం
వైఖరి మార్చుకోకపోతే మూకుమ్మడి రాజీనామాలు తప్పవన్న స్థానిక నేతలు

అమరావతి,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు పురపాలక సంఘంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. స్థానిక జనసైనికులకు పార్టీ అధిష్ఠానం ఊహించని నిర్ణయంతో షాక్ ఇచ్చింది. ప్రతిపక్ష వైసీపీలో కొనసాగుతున్న నాయకురాలికే జనసేన పార్టీ తరఫున చైర్‌పర్సన్ టికెట్‌ను కేటాయించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ అనూహ్య పరిణామంతో అటు టీడీపీ, ఇటు జనసేన స్థానిక శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సాలూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన గొర్లె విజయకుమారి, 2023 తర్వాత తన భర్తతో కలిసి వైకాపాలో చేరారు. అయితే, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ ఆమెకు టికెట్ నిరాకరించింది. ఈ నేపథ్యంలో, ఆమెకు అనూహ్యంగా జనసేన నుంచి చైర్‌పర్సన్ అభ్యర్థిత్వం ఖరారు కావడం గమనార్హం.అయితే, విజయకుమారి ఇప్పటివరకు వైసీపీకి అధికారికంగా రాజీనామా చేయలేదు. అలాగే జనసేన పార్టీలో సభ్యత్వం కూడా తీసుకోలేదు. అయినప్పటికీ ఆమెకు టికెట్ కేటాయించడం కూటమిలో రాజకీయ దుమారం రేపుతోంది. జనసేన అధిష్ఠానం తీసుకున్న ఈ నిర్ణయంపై టీడీపీ, జనసేన కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయకుమారికి తాము సహకరించేది లేదని తెలుగుదేశం శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి.మరోవైపు, పార్టీ అధిష్ఠానం తన వైఖరి మార్చుకోకపోతే తామంతా మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమని స్థానిక జనసేన నాయకులు హెచ్చరిస్తున్నారు. శుక్రవారం సాలూరు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ నాగబాబు, 32 కౌన్సిలర్ స్థానాల్లోనూ నామినేషన్లు వేయాలని సూచించారని.. అటువంటిది తమతో కనీస సంప్రదింపులు జరపకుండా చైర్‌పర్సన్ టికెట్‌ను ఎలా ప్రకటిస్తారని స్థానిక నేతలు నిలదీస్తున్నారు. ఈ పరిణామాలతో సాలూరులో కూటమి పొత్తుల రాజకీయాలు గందరగోళంలో పడ్డాయి.

విజయవాడ సరస్ మేళాలో చైనా రాయబారి.. మహిళల నైపుణ్యాలపై ప్రశంసలు



విజయవాడ సరస్ మేళాను సందర్శించిన చైనా రాయబారి జు ఫీహాంగ్
మహిళా పారిశ్రామికవేత్తల స్టాళ్లను పరిశీలించిన చైనా ప్రతినిధుల బృందం
స్వయం సహాయక సంఘాల మహిళల నైపుణ్యాలను మెచ్చుకున్న రాయబారి
కొన్ని ఉత్పత్తులను కొనుగోలు చేసి మహిళలను ప్రోత్సహించిన బృందం
ఎన్టీఆర్ జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించిన చైనా ప్రతినిధులు

అమరావతి,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

భారత చైనా రాయబారి జు ఫీహాంగ్ ఆదివారం విజయవాడలో పర్యటించారు. పున్నమి ఘాట్‌లో జరుగుతున్న జాతీయ సరస్ మేళా--2026ను ఆయన తన బృందంతో కలిసి సందర్శించారు. ఈ మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా తిలకించిన ఆయన, మహిళా పారిశ్రామికవేత్తలను అభినందించారు.జు ఫీహాంగ్ వెంట ఆయన భార్య టాన్ యుక్సియుతో పాటు ఐదుగురు సభ్యుల చైనా ప్రతినిధుల బృందం ఉంది. వీరంతా కలిసి మేళాలోని స్టాళ్లను పరిశీలించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలతో ముచ్చటించి, వారు తయారు చేసిన ఉత్పత్తుల విశేషాలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్న తీరును, వారి సృజనాత్మకతను, నైపుణ్యాలను జు ఫీహాంగ్ ప్రత్యేకంగా ప్రశంసించారు.చైనా ప్రతినిధుల బృందం అక్టోబర్ 16 నుంచి 18 వరకు ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించింది. ఈ పర్యటనలో భాగంగానే వారు సరస్ మేళాను సందర్శించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మేళా అక్టోబర్ 30 వరకు కొనసాగనుంది. దేశవ్యాప్తంగా 600కు పైగా స్టాళ్లను ఇందులో ఏర్పాటు చేశారు. కాగా, ఈ మేళాను అక్టోబర్ 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించిన విషయం విదితమే.

భారత్ మాకు ముఖ్య మిత్రదేశం: రష్యా ఆయిల్ కొనుగోళ్లపై అమెరికా కీలక వ్యాఖ్యలు



రష్యా ఇంధన కొనుగోళ్లపై ఆంక్షల నుంచి భారత్‌కు తాత్కాలిక మినహాయింపు

60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్టు ప్రకటించిన ట్రంప్ ప్రభుత్వం

భారత్ ఒక్కసారిగా మారడం కష్టమని అమెరికా వ్యాఖ్య

భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని సంకేతాలు

న్యూఢిల్లీ,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

భారత్ అమెరికాకు అత్యంత ముఖ్యమైన మిత్రదేశమని, ఇంధన అవసరాల కోసం రష్యాపై ఆధారపడటాన్ని ఒక్క రోజులో మార్చుకోవడం కష్టమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో వ్యాఖ్యానించారు. రష్యా నుంచి భారీగా ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న భారత్‌కు అమెరికా తాత్కాలిక ఊరట కల్పిస్తూ అమెరికా నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రుబియో ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాపై విధించిన ఆంక్షల చట్టం నుంచి భారత్ సహా కొన్ని దేశాలకు 60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం 'లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్' కింద ఈ వెయివర్‌పై సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు, గ్యాస్ కొనుగోలు చేసే టాప్ 5 దేశాల (భారత్, చైనా సహా) నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారం ఉంది. అయితే, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ట్రంప్ ఈ నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేశారుశనివారం వాషింగ్టన్‌లో విలేకరులతో మాట్లాడిన మార్కో రుబియో, ఈ నిర్ణయం వెనుక గల కారణాలను వివరించారు. "ఈ ఆంక్షలు కేవలం రష్యాపైనే కాదు. భారత్ వంటి ఇతర దేశాలపైనా టారిఫ్‌ల రూపంలో ప్రభావం చూపుతాయి. అందుకే అధ్యక్షుడు 60 రోజుల సమయం తీసుకుని, ప్రపంచ, అమెరికా ఆర్థిక వ్యవస్థలపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని భావిస్తున్నారు" అని తెలిపారు. భారత్ ఇంధన వనరులను వైవిధ్యపరుచుకుంటున్నప్పటికీ, రష్యా నుంచి ఇంకా గణనీయమైన మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తోందని, ఇది ఒక్కరోజులో మారే ప్రక్రియ కాదని ఆయన స్పష్టం చేశారు.ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా నుంచి చౌకగా ముడి చమురు లభించడంతో భారత్ భారీగా దిగుమతులను పెంచుకుంది. ప్రస్తుతం భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉంది. అయితే, తమ ఇంధన భద్రత కోసం వివిధ దేశాల నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొనుగోళ్లు జరుపుతామని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది.ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్, భారత్ పర్యటనలో ఉన్న రుబియో, భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమై, జామ్‌నగర్‌లోని రిఫైనరీని సందర్శించనున్నారు. ఈ 60 రోజుల అధ్యయనం తర్వాత అమెరికా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ మినహాయింపు భారత్‌కు ఉపశమనం కలిగించినప్పటికీ, భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

నూడుల్స్ తిన్న తర్వాత కుటుంబం మొత్తం మృతి.. ఫుడ్ పాయిజనా? విషప్రయోగమా?

గ్రేటర్ నోయిడాలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి మృతి

నూడుల్స్ తిని, టీ తాగాక మరణించిన కుటుంబం

విషప్రయోగం జరిగిందని అధికారుల అనుమానం

ఆస్తి తగాదాల కోణంలోనూ కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలతోనే తేలనున్న వాస్తవాలు

న్యూఢిల్లీ,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు అనుమానాస్పద రీతిలో మరణించారు. రబుపురా ప్రాంతంలోని నగ్లా శ్రీ పదమ్ గ్రామంలో శనివారం ఉదయం ఈ హృదయవిదారక ఘటన వెలుగుచూసింది. ముందురోజు రాత్రి నూడుల్స్ తిని, టీ తాగాక నిద్రపోయిన వీరు, ఉదయం విగతజీవులుగా కనిపించారు. తొలుత ఆహారం కలుషితమైందని భావించినప్పటికీ, విషప్రయోగం జరిగి ఉండవచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారుమృతుల్లో భార్యాభర్తలు మహేశ్ (37), లలిత (35)తో పాటు వారి ముగ్గురు పిల్లలు లడ్డూ (11), మిష్టి (7), సాక్షత్ (3) ఉన్నారు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో వీరంతా నూడుల్స్ తిని, టీ తాగిన తర్వాత నిద్రకు ఉపక్రమించారు. శనివారం ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లాల్సి ఉండగా, ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన బంధువులు, ఇరుగుపొరుగు వారు తలుపులు తెరిచి చూడగా, ఐదుగురూ మంచాలపై విగతజీవులుగా పడి ఉన్నారు. వారి నోటి నుంచి నురగలు వస్తున్నట్లు కొందరు గమనించారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు, ఆహార భద్రతా విభాగం అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఆహార నమూనాలను పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఆహార భద్రతా అధికారి ఓ.పి. సింగ్ మాట్లాడుతూ.. "తిన్న ఆహార ప్యాకెట్లలో గడువు ముగిసినవి ఏవీ లేవు. సాధారణంగా ఫుడ్ పాయిజన్ అయితే కనిపించే వాంతులు, విరేచనాల వంటి లక్షణాలు కూడా లేకపోవడంతో ఇది విషప్రయోగం కేసులా కనిపిస్తోంది"

శీతలామాత ఆలయం వద్ద లారీ బీభత్సం..

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్2లో ఘోర ప్రమాదం

ప్రమాదంలో 30 మందికి పైగా గాయాలు, పలువురి పరిస్థితి విషమం

ఎస్పీపై వేటు, 8 మంది పోలీసుల సస్పెన్షన్

రాజస్థాన్‌లో లారీ డ్రైవర్, యజమాని అరెస్ట్

న్యూఢిల్లీ,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం



మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నవరాత్రి ఉత్సవాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. శీతలామాత ఆలయం వద్ద భక్తులపైకి ఓ లారీ దూసుకెళ్లడంతో 15 మంది దుర్మరణం చెందారు. ఇద్దరు పోలీసులు సహా 30 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం, గ్వాలియర్ ఎస్పీని తొలగించి, మరో 8 మంది పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసింది.గ్వాలియర్ నగరానికి 20 కిలోమీటర్ల దూరంలోని శీతలామాత ఆలయం వద్ద శనివారం-ఆదివారం మధ్యరాత్రి 1:30 గంటల సమయంలో ఈ ఘోర దుర్ఘటన జరిగింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ సమయంలో ధాన్యం లోడుతో పంజాబ్ రిజిస్ట్రేషన్ గల లారీ, భారీ వాహనాలకు ప్రవేశం లేని నిషేధిత మార్గంలోకి ప్రవేశించింది. ఏటవాలుగా ఉన్న ఈ దారిలో పోలీసు బారికేడ్లను ఢీకొట్టి, వేగంగా భక్తులపైకి దూసుకెళ్లింది. అనంతరం ఆలయ ప్రవేశ ద్వారాన్ని, గోడను ఢీకొట్టి ఆగింది. బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. గూగుల్ మ్యాప్స్ చూపించిన షార్ట్‌కట్ మార్గంలో డ్రైవర్ ఈ దారిలోకి వచ్చి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.ఈ దుర్ఘటనలో 13 ఏళ్ల బాలుడి నుంచి 50 ఏళ్ల వృద్ధురాలి వరకు పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రుల వద్ద మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆవేదనలతో ఆ ప్రాంతమంతా హృదయవిదారకంగా మారింది. "రెండు చక్రాల వాహనాలకు కూడా అనుమతి లేని చోటికి లారీ ఎలా వచ్చింది?" అని బాధితులు ప్రభుత్వాన్ని నిలదీశారు. భద్రతా వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని వారు ఆరోపించారు.ఘటనపై తీవ్రంగా స్పందించిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, తక్షణమే గ్వాలియర్ ఎస్పీ రవి భదౌరియాను తొలగించారు. ముగ్గురు ఎస్‌హెచ్ఓలు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సహా మొత్తం 8 మంది పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.4 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. చికిత్స ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.ప్రమాదం జరిగిన తర్వాత పారిపోయిన లారీ డ్రైవర్ దిల్‌బాగ్ సింగ్, యజమానిని రాజస్థాన్‌లోని ధోల్‌పూర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నోయిడా కుటుంబం మృతి కేసులో ఊహించని మలుపు..



గ్రేటర్ నోయిడాలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అనుమానాస్పద మృతి

భర్తే నూడుల్స్‌లో విషం కలిపినట్లు పోలీసుల అనుమానం

ఆస్తి తగాదాల వల్లే ఈ ఘోరం జరిగిందని ప్రాథమిక నిర్ధారణ

మృతుడి ఫోన్‌లో లభించిన ఆడియో నోట్

ఆధారంగా ముగ్గురు బంధువుల అరెస్ట్

పోస్టుమార్టంలో విషప్రయోగం జరిగినట్లు వెల్లడి, ల్యాబ్ నివేదిక కోసం ఎదురుచూపులు

న్యూఢిల్లీ,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం

ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరిగిన ఒకే కుటుంబం మృతి కేసులో ఊహించని, దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. కుటుంబ పెద్దే తన భార్యాపిల్లలకు ఆహారంలో విషం కలిపి, ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఆస్తి తగాదాలే ఈ ఘోరానికి దారితీశాయని పోలీసు వర్గాలు తెలిపాయి.వివరాల్లోకి వెళితే.. గ్రేటర్ నోయిడా పరిధిలోని నాగ్లా శ్రీ పదం గ్రామంలో నివసిస్తున్న మహేశ్ (37), అతని భార్య లలిత (35), వారి ముగ్గురు పిల్లలు లడ్డూ (11), మిష్టి (7), సాక్షాత్ (3) శనివారం ఉదయం తమ ఇంట్లోని ఒక గదిలో విగతజీవులుగా కనిపించారు. శుక్రవారం రాత్రి స్థానికంగా జరిగిన ఒక జాతర నుంచి తిరిగి వచ్చిన ఈ కుటుంబం, రాత్రి భోజనంలో నూడుల్స్, టీ తీసుకున్నట్లు తెలిసింది. తొలుత ఇది ఫుడ్ పాయిజనింగ్ వల్లే జరిగిందని భావించినప్పటికీ, పోలీసుల దర్యాప్తులో కొత్త కోణం వెలుగుచూసింది.మహేశ్ తన ఫోన్‌లో రికార్డ్ చేసిన ఒక ఆడియో నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన కుటుంబం ఈ పరిస్థితికి రావడానికి తన ఇద్దరు సోదరీమణులు, ఒక బావమరిదే కారణమని అందులో ఆరోపించాడు. వారి వేధింపుల కారణంగానే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు మహేశ్ పేర్కొన్నాడు. ఈ ఆడియో నోట్ ఆధారంగా వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహేశ్ నూడుల్స్‌లో విషం కలిపి కుటుంబ సభ్యులకు పెట్టి, అనంతరం తానూ తిని మరణించి ఉంటాడని పోలీసులు బలంగా అనుమానిస్తున్నారు.ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆహార భద్రతా అధికారులు, అక్కడ గడువు ముగిసిన ఆహార పదార్థాలేవీ లేవని, సాధారణ ఫుడ్ పాయిజనింగ్ కాకుండా ఏదో విషపూరిత పదార్థం వల్లే మరణాలు సంభవించి ఉంటాయని అభిప్రాయపడ్డారు. మృతదేహాలకు నిర్వహించిన పోస్టుమార్టం పరీక్షల్లో విషప్రయోగం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది.పూర్తి వివరాల కోసం మృతుల శరీర భాగాల (విసరా) నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబొరేటరీకి పంపించారు. ల్యాబ్ నివేదిక వచ్చిన తర్వాత మరణాలకు కచ్చితమైన కారణం తెలుస్తుందని అధికారులు తెలిపారు. కాగా, మహేశ్‌తో పాటు నివసిస్తున్న అతని వృద్ధ తల్లి, ఆ రాత్రి భోజనం చేయకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

కోల్‌కతా తొక్కిసలాట ఘటన.. బాధితులను పరామర్శించిన అమిత్ షా.. ఏడుగురి అరెస్ట్

కోల్‌కతా దుర్గా పూజ మండపంలో తొక్కిసలాటలో 19 మంది మృతి, 25 మందికి గాయాలు

క్షతగాత్రులను పరామర్శించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం సువేందు అధికారి

నిర్వాహకులు సహా ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో సిట్ దర్యాప్తునకు ఆదేశం

న్యూఢిల్లీ,అక్టోబర్18సామాన్యుడి అస్త్రం



పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దుర్గా పూజ ఉత్సవాల్లో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బగాన్ సార్వజనిన్ దుర్గా పూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో 19 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేడు కోల్‌కతాలో పర్యటించి, బాధితులను పరామర్శించారుఈ విషాద ఘటన కారణంగా రాష్ట్రంలో తన ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలను అమిత్ షా వాయిదా వేసుకున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వెంటరాగా, ఆయన నగరంలోని ఒక ప్రైవేట్ నర్సింగ్ హోంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్. రవి, రాష్ట్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ శరద్‌వత్ ముఖర్జీ కూడా గాయపడిన వారిని పరామర్శించారు.ఈ ఘటనపై కోల్‌కతా పోలీసులు వేగంగా స్పందించారు. తొలుత 14 మందిని అదుపులోకి తీసుకోగా, విచారణ అనంతరం పూజా కమిటీ నిర్వాహకులు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో కమిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షుడు కూడా ఉన్నారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి, హత్యకు సమానం కాని నరహత్య కింద అభియోగాలు నమోదు చేశారు.శనివారం సాయంత్రం ఆకస్మిక వర్షం కురవడంతో భక్తులు భయాందోళనలకు గురయ్యారు. అదే సమయంలో మండపంలో తప్పుడు ప్రకటనలు చేయడంతో గందరగోళం చెలరేగి తొక్కిసలాటకు దారితీసిందని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఇరుకైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా సిబ్బంది కొరత, గుంపును అదుపు చేయడంలో వైఫల్యం వంటివి కూడా ఈ దుర్ఘటనకు ప్రధాన కారణాలుగా గుర్తించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు కలకత్తా హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.మరోవైపు మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షల నష్టపరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు తలా రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది.

క్యాన్సర్ రోగులకు భారీ ఊరట..



137 క్యాన్సర్ మందులపై 30 శాతం ట్రేడ్ మార్జిన్ పరిమితి

రోగులకు ఏటా రూ. 2,500 కోట్ల ఆదా అంచనా

నవంబర్ 9 నుంచి అమల్లోకి కొత్త ధరలు

క్యాన్సర్ చికిత్సతో ఆర్థికంగా కుంగిపోతున్న రోగులకు కేంద్ర ప్రభుత్వం అతిపెద్ద ఊరట కల్పించింది. అత్యంత కీలకమైన 137 రకాల క్యాన్సర్ నిరోధక మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికే పరిమితం చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ఈ మందుల గరిష్ట చిల్లర ధరలు (ఎంఆర్‌పీ) 70 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. ఈ కొత్త ధరలు నవంబర్ 9వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి.నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) అక్టోబర్ 17న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. డ్రగ్స్ (ప్రైసెస్ కంట్రోల్) ఆర్డర్, 2013లోని పారా 19 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం, తయారీదారు నుంచి వినియోగదారుడికి చేరే క్రమంలో స్టాకిస్టులు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైలర్ల లాభం కలిపి గరిష్టంగా 30 శాతానికి మించకూడదు. ఈ నిర్ణయంతో రోగులకు ఏటా సుమారు రూ. 2,500 కోట్ల మేర ఆదా అవుతుందని అంచనా వేస్తున్నారు.ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిపుణుల కమిటీ సిఫార్సు చేసిన 137 మందుల జాబితాలో నివోలుమాబ్, బెవాసిజుమాబ్, అటెజోలిజుమాబ్, ఓలపారిబ్, డెనోసుమాబ్, పెగ్‌ఫిల్‌గ్రాస్టిమ్, ఎన్‌జలుటమైడ్ వంటి ఖరీదైన ఔషధాలు ఉన్నాయి. బ్రాండెడ్, జనరిక్, దేశీయ, దిగుమతి చేసుకున్న, పేటెంట్ ఉన్న, పేటెంట్ లేని అన్ని రకాల మందులకు ఈ నిబంధన వర్తిస్తుంది.క్యాన్సర్ మందుల అధిక ధరలపై సుప్రీంకోర్టు సైతం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గతంలో 2019లో కూడా 42 క్యాన్సర్ మందులపై ఇదే తరహాలో ట్రేడ్ మార్జిన్‌ను నియంత్రించడం ద్వారా ధరలను గణనీయంగా తగ్గించారు. ఈ ఆదేశాల ప్రకారం, ఔషధ తయారీదారులు 7 రోజుల్లోగా సవరించిన ధరల జాబితాను ఎన్‌పీపీఏకి సమర్పించి, తమ వెబ్‌సైట్లలో ప్రచురించాలి. రిటైలర్లు, ఆసుపత్రులు తప్పనిసరిగా కొత్త ధరలనే వసూలు చేయాలని, రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్లు దీన్ని పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది.

యాంటీబయాటిక్స్ వాడే ముందు..
దగ్గు గురించి ఈ నిజాలు తెలుసుకోండి!

దగ్గులో పాడి దగ్గు, కఫంతో కూడిన దగ్గు అని ప్రధానంగా రెండు రకాలు

గొంతులో చికాకుతో కఫం లేకుండా వస్తే అది పాడి దగ్గు

కఫం లేదా శ్లేష్మం ఉత్పత్తి అయితే అది కఫంతో కూడిన దగ్గు

మూడు వారాలకు మించి తగ్గకపోయినా, జ్వరం ఉన్నా వైద్యులను సంప్రదించాలి

వైద్యుడి సలహా లేకుండా సొంతంగా యాంటీబయాటిక్స్ వాడటం ప్రమాదకరం



వాతావరణ మార్పులు, ఇన్ఫెక్షన్ల కారణంగా చాలామందిని వేధించే సాధారణ సమస్య.. దగ్గు. అయితే, వచ్చే దగ్గులన్నీ ఒకే రకంగా ఉండవు. దగ్గును దాని లక్షణాలను బట్టి ప్రధానంగా పొడి దగ్గు , కఫంతో కూడిన దగ్గు అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ఈ రెండింటి మధ్య తేడాలను అర్థం చేసుకోవడం ద్వారా సరైన జాగ్రత్తలు తీసుకోవడానికి, అవసరమైతే వైద్యులను సంప్రదించడానికి వీలవుతుంది.

పొడి దగ్గు లక్షణాలు ఎలా ఉంటాయి?

పొడి దగ్గులో కఫం లేదా శ్లేష్మం ఉత్పత్తి కాదు. ఇది ప్రధానంగా గొంతులో చికాకు, దురద లేదా గరగర వంటి అనుభూతిని కలిగిస్తుంది. దుమ్ము, పొగ, కాలుష్యం, అలర్జీలు లేదా కొన్ని వైరల్ ఇన్ఫెక్షన్ల కారణంగా ఇది అకస్మాత్తుగా ప్రారంభమవుతుంది. ముఖ్యంగా రాత్రిపూట దీని తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తరచుగా దగ్గడం వల్ల గొంతు నొప్పి కూడా రావచ్చు. దీనికి ప్రధాన కారణం శ్వాసనాళాల్లోని వాపు లేదా చికాకే కానీ, శ్లేష్మం చేరడం కాదు.

కఫంతో కూడిన దగ్గు అంటే ఏమిటి?

దీన్నే ఉత్పాదక దగ్గు అని కూడా అంటారు. ఈ రకం దగ్గు వచ్చినప్పుడు శ్వాసనాళాలు లేదా ఊపిరితిత్తులలో పేరుకుపోయిన కఫం లేదా శ్లేష్మం బయటకు వస్తుంది. జలుబు, ఫ్లూ, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల సమయంలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. కఫం పేరుకుపోవడం వల్ల ఛాతీలో బరువుగా లేదా పట్టేసినట్లు అనిపించడం దీని ముఖ్య లక్షణం. శరీరంలోని ఇన్ఫెక్షన్‌ను, శ్లేష్మాన్ని బయటకు పంపేందుకు శరీరం చేసే ప్రయత్నంలో భాగంగా ఈ దగ్గు వస్తుంది.

వైద్యులను ఎప్పుడు సంప్రదించాలి?

సాధారణంగా దగ్గు కొద్ది రోజుల్లో తగ్గిపోతుంది. కానీ, కొన్ని సందర్భాల్లో దాన్ని నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. కింది లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది.

దగ్గు మూడు వారాలకు మించి తగ్గకుండా కొనసాగితే.

దగ్గుతో పాటు తీవ్రమైన జ్వరం, ఛాతీ నొప్పి లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే.

దగ్గినప్పుడు వచ్చే కఫంలో రక్తం కనిపిస్తే.

దగ్గు తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నా లేదా చికిత్స తీసుకున్నా తగ్గకపోయినా.

ముఖ్య గమనిక: సొంత వైద్యం ప్రమాదకరం

చాలామంది కఫంతో దగ్గు వస్తే అది బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ అని భావించి, వైద్యుడి సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతి కఫంతో కూడిన దగ్గు బ్యాక్టీరియా వల్లనే రాదు. వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల కూడా రావచ్చు. అనవసరంగా యాంటీబయాటిక్స్ వాడటం వల్ల శరీరంలో ప్రతికూల నిరోధకత (ూూత్అఎఅశీఅఽ =వంఅఝఅఎవ) పెరిగి, భవిష్యత్తులో నిజంగా అవసరమైనప్పుడు అవి పనిచేయకుండా పోయే ప్రమాదం ఉంది. కాబట్టి, దగ్గు లక్షణాలను బట్టి సొంతంగా నిర్ణయాలు తీసుకోకుండా, వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకే మందులు వాడటం ఉత్తమం.

బరువు తగ్గడానికి సరికొత్త జపనీస్ 3-3-3 వాకింగ్ ఫార్ములా!

బరువు తగ్గడానికి జపనీస్ 3-3-3 వాకింగ్ ఫార్ములా

రోజుకు కేవలం 18 నిమిషాల ఇంటర్వెల్ వాకింగ్

ఏరోబిక్ సామర్థ్యం, రక్తపోటు నియంత్రణలో మెరుగుదల

అన్ని వయసుల వారికి అనువైన సులభమైన వ్యాయామం

ఆహార నియమాలతో పాటిస్తే ఉత్తమ ఫలితాలు

బరువు తగ్గడానికి, ఫిట్‌గా ఉండటానికి గంటల తరబడి జిమ్‌లో కష్టపడాల్సిన అవసరం లేదంటున్నారు ఆరోగ్య నిపుణులు. జపాన్‌కు చెందిన ఒక సులభమైన వాకింగ్ టెక్నిక్ ఇప్పుడు



ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అదే 'జపనీస్ 3-3-3 ఫార్ములా' లేదా 'ఇంటర్వెల్ వాకింగ్ ట్రైనింగ్'. రోజుకు కేవలం 18 నిమిషాలు కేటాయించడం ద్వారా బరువును నియంత్రించుకోవడంతో పాటు శారీరక సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని ఈ పద్ధతి సూచిస్తోంది. దీనికి ప్రత్యేకమైన పరికరాలు గానీ, ఖరీదైన జిమ్ సభ్యత్వం గానీ అవసరం లేదు.

ఏమిటీ 3-3-3 ఫార్ములా?.. ఎలా చేయాలి?

ఈ వాకింగ్ టెక్నిక్ చాలా సులభం. దీని ప్రకారం మొదట మూడు నిమిషాల పాటు నెమ్మదిగా, సౌకర్యవంతమైన వేగంతో నడవాలి. ఆ తర్వాత వెంటనే, మరో మూడు నిమిషాల పాటు వీలైనంత వేగంగా నడవాలి. వేగంగా నడిచేటప్పుడు గుండె వేగం, శ్వాస పెరగాలి, కానీ చిన్న చిన్న వాక్యాలు మాట్లాడగలిగేలా ఉండాలి. ఇలా నెమ్మది, వేగవంతమైన నడకను ఒక సైకిల్‌గా పరిగణించి, దీనిని మూడుసార్లు పునరావృతం చేయాలి. అంటే మొత్తం 18 నిమిషాల్లో ఈ వ్యాయామం పూర్తవుతుంది. మరింత మంచి ఫలితాల కోసం, వారానికి కనీసం నాలుగు రోజులు, ఈ సైకిల్‌ను ఐదుసార్లు (మొత్తం 30 నిమిషాలు) చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ వాకింగ్‌ను పార్కులో, ట్రెడ్‌మిల్‌పై లేదా ఇంట్లో ఉన్న కాస్త స్థలంలోనైనా చేయవచ్చు.

బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధులకు ఇంటిగ్రేటెడ్ ట్రీట్‌మెంట్



బీపీ, షుగర్, కిడ్నీ సమస్యలకు వేర్వేరుగా కాకుండా ఉమ్మడి చికిత్స

'కార్డియోవాస్కులర్-కిడ్నీ-మెటబాలిక్ సిండ్రోమ్'గా గుర్తింపు

దేశవ్యాప్తంగా 50 మంది వైద్య నిపుణులు రూపొందించిన 'వారణాసి డిక్లరేషన్ 2026'

భారతీయుల శరీర తత్వానికి అనుగుణంగా కొత్త వైద్య ప్రమాణాలు ప్రతిపాదన

కీలక ఔషధాలను నిత్యావసర జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), కిడ్నీ జబ్బులు... ఈ మూడింటినీ వేర్వేరు సమస్యలుగా చూస్తూ, వేర్వేరు వైద్యులతో చికిత్స చేయించుకోవడం ప్రమాదకరమని భారత వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ మూడు వ్యాధులను కలిపి ఒకే సిండ్రోమ్‌గా పరిగణించి, సమగ్ర చికిత్స అందించాలని సూచిస్తున్నారు. ఈ మేరకు దేశంలోని వివిధ విభాగాలకు చెందిన 50 మంది ప్రముఖ వైద్యులు రూపొందించిన 'వారణాసి డిక్లరేషన్ 2026' పేరుతో ఒక విధాన పత్రాన్ని విడుదల చేశారు. ఈ ప్రతిపాదనలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తూ, ప్రతిష్ఠాత్మక వైద్య జర్నల్ 'ది లాన్సెట్ రీజినల్ హెల్త్ – సౌత్‌ఈస్ట్ ఆసియా'లో ఇది ప్రచురితమైంది.

సమగ్ర చికిత్స ఎందుకు అవసరం?

ప్రస్తుతం మన దేశంలో బీపీకి జనరల్ ఫిజీషియన్, షుగర్‌కు ఎండోక్రైనాలజిస్ట్, కిడ్నీ సమస్యలకు నెఫ్రాలజిస్ట్ వద్దకు వెళ్లే విధానం అమల్లో ఉంది. అయితే బీపీ, షుగర్, కిడ్నీ సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, వీటిని కలిపి 'కార్డియోవాస్కులర్-కిడ్నీ-మెటబాలిక్' (సీకేఎం) సిండ్రోమ్‌గా చూడాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ మూడు సమస్యలూ ఉన్నవారు పదేళ్లలోపు గుండె జబ్బులతో మరణించే ప్రమాదం 30 నుంచి 50 శాతం వరకు అధికంగా ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో ఏటా దాదాపు 25 లక్షల మంది ఇలాంటి సమస్యలతో అకాల మరణం చెందుతున్నారని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. వీరికి అవసరమైన మూడు కీలక ఔషధాలను (రెనిన్-యాంజియోటెన్సిన్ బ్లాకర్స్, ఎస్జీఎల్‌టీ2 ఇన్హిబిటర్లు, స్టాటిన్లు) కలిపి వాడుతున్న రోగులు 20 శాతం కన్నా తక్కువ ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

భారతీయుల కోసం కొత్త ప్రమాణాలు

పాశ్చాత్య దేశాల ప్రజలతో పోలిస్తే భారతీయుల శరీర తత్వం భిన్నంగా ఉంటుంది. ఇక్కడ చాలామంది 'థిన్-ఫ్యాట్' రకానికి చెంది ఉంటారు. అంటే, పైకి సన్నగా కనిపించినా, అంతర్గత అవయవాల చుట్టూ కొవ్వు పేరుకుపోయి ఉంటుంది. దీనివల్ల చిన్న వయసులోనే గుండె జబ్బుల ముప్పు పెరుగుతోంది. అందుకే, పాశ్చాత్య దేశాల బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) కొలతలు మనకు సరిపోవని నిపుణులు తేల్చారు. భారతీయులకు బీఎంఐ 23 దాటితే అధిక బరువుగా, 27.5 దాటితే స్థూలకాయంగా పరిగణించాలని సూచించారు. పురుషుల్లో నడుము చుట్టుకొలత 90 సెం.మీ, స్త్రీలలో 80 సెం.మీ మించకూడదని పేర్కొన్నారు. అమెరికా రిస్క్ కాలిక్యులేటర్లకు బదులుగా, మన దేశ ప్రజల సమాచారంతో 'ఇండియా-ప్రివెంట్' పేరుతో ప్రత్యేక రిస్క్ అసెస్‌మెంట్ వ్యవస్థను రూపొందించాలని ప్రతిపాదించారు.

బరువు తగ్గాలనుకుంటున్నారా? ఆకలేస్తే ఈ 10 స్నాక్స్‌ట్రై చేయండి!



బరువు తగ్గాలంటే స్నాక్స్ పూర్తిగా మానాల్సిన అవసరం లేదంటున్న నిపుణులు

మసాలా మజ్జిగలో ప్రోటీన్.. దీంతో ఎక్కువ సేపు కడుపు నిండిన భావన

చిలగడదుంపతో తీపి కోరికకు చెక్ పెట్టడంతో పాటు కాంప్లెక్స్ కార్బ్స్

పరిమితంగా తీసుకుంటే పనీర్, డార్క్ చాక్లెట్, పీనట్ బటర్ కూడా మంచివే

వేయించిన పనీర్ ముక్కలు, పుచ్చకాయ, నట్స్ కూడా మంచివే!

బరువు తగ్గాలంటే స్నాక్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాల్సిన అవసరం లేదు. భోజనాల మధ్య ఎక్కువ గ్యాప్ వస్తే మరింత ఆకలి వేయొచ్చు. దీంతో తర్వాతి భోజనంలో ఎక్కువగా తినే అవకాశం ఉంటుంది. అందుకే ఆకలిని అదుపులో ఉంచే స్నాక్‌ను ఎంచుకోవడం ముఖ్యం. ఎన్డీటీవీ కథనం ప్రకారం.. పోషకాహార నిపుణురాలు లవ్‌నీత్ బాత్రా 10 స్నాక్స్ సూచించారు. అవేంటో చూద్దాం.

1. మసాలా మజ్జిగ: ఈ లిస్ట్‌లో మసాలా మజ్జిగకు మొదటి స్థానం ఇచ్చారు. ఇందులో ప్రోటీన్ ఉండటంతో ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుందని లవ్‌నీత్ బాత్రా చెబుతున్నారు.

2. కాల్చిన చిలగడదుంప: చిలగడదుంపలో కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. తీపి తినాలనిపించినప్పుడు కూడా ఇది మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుందని నిపుణురాలు సూచించారు.

3. మరమరాల చాట్: మరమరాలతో తయారు చేసే చాట్ పెద్ద పరిమాణంలో తిన్నా కేలరీలు ఎక్కువగా చేరకుండా చూసుకోవచ్చని ఆమె చెబుతున్నారు. ఇందులో కూరగాయలు కలిపితే మరింత పోషకాహారంగా మారుతుంది.

4. కూరగాయలు.. శనగల పేస్ట్: కీర, క్యారెట్ వంటి కూరగాయల ముక్కలను శనగలతో తయారు చేసిన పేస్ట్ (హమ్మస్)తో కలిపి తినొచ్చు. కూరగాయల నుంచి ఫైబర్, శనగల పేస్ట్ నుంచి ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు లభిస్తాయి. తేలికగా ఉండే ఈ స్నాక్ ఆకలిని కొంతసేపు అదుపులో ఉంచుతుంది.

పెళ్లి చేసుకోవద్దని నేనెప్పుడూ చెప్పలేదు!

నరేశ్ విజయకృష్ణ, అనుపమ పరమేశ్వరన్(తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డమారి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'క్రేజీ కల్యాణం'ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది. తమ సినిమాకు ప్రేక్షకుల ఆదరణ బాగుందని పేర్కొంటూ టీమ్.. మూవీ సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ.. "క్రేజీ కల్యాణం' లాంటి మంచి సినిమా రావాలంటే గట్స్, ప్యాషన్ ఉన్న టీమ్ కావాలి. 'పరదా' కంటెంట్‌పై నమ్మకం ఉందని చెప్పా.ఇప్పుడు ఓటీటీలో ఆ మూవీ ట్రెండ్ అవుతోంది. మంచి సినిమా చేస్తే ప్రేక్షకులు ప్రశంసిస్తారనేందుకు ఆ సినిమా ఉదాహరణ. నేను కంటెంట్ ఓరియెంటెడ్, కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రాలను బ్యాలెన్స్ చేసేందుకు ప్రయత్నిస్తున్నా. దాంతో ప్రేక్షకులకు వినోదంతోపాటు ఒక చిన్న మెసేజ్ కూడా ఇవ్వగలుగుతున్నా. కొత్తగా ఏదో చెప్పాలని అనుకుంటా. 'క్రేజీ కల్యాణం' లాంటి కాస్ట్ అండ్ క్రూను, ఇలాంటి మంచి కథలను సపోర్ట్ చేయడాన్ని ఇష్టపడతా.ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా నేను పెళ్లి గురించి చేసిన వ్యాఖ్యలను సగం మాత్రమే కట్ చేసి తప్పుగా ప్రచారం చేస్తున్నారు. పెళ్లి చేసుకోవద్దని నేనెప్పుడూ చెప్పలేదు. పెళ్లి చేసుకోకపోయినా పిల్లలు కావాలనుకుంటే ప్లాన్ చేసుకోవచ్చని, కానీ పిల్లల కోసమే పెళ్లి చేసుకుని ఆ తర్వాత విడాకులు తీసుకోవడం సరైన పద్ధతి కాదని మాత్రమే నేను చెప్పాను. పిల్లల్ని కంటే వారికి సంతోషకరమైన జీవితాన్ని అందించడం ముఖ్యమనేది నా ఉద్దేశం" అని చెప్పింది.



మళ్లొచ్చే దీపావళికే స్పిరిట్



రెబల్ స్టార్ ప్రభాస్ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ మేకర్ సందీప్ రెడ్డి వంగా(కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'స్పిరిట్' థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను లాక్ చేసుకుంది. ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ, తాజాగా మేకర్స్ కొత్త రిలీజ్ పోస్టర్ ద్వారా మారిన విడుదల తేదీని ప్రకటించారు. భారీ అంచనాలున్న ఈ యాక్షన్ డ్రామా 2027 అక్టోబర్ 29న దీపావళి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

పార్టీ మధ్యలో రణ్‌వీర్ ప్యాంట్ చిరిగింది..



బాలీవుడ్‌లో అత్యంత పాప్యులర్ రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొణె జంట ఒకటి. వెండితెరపైనే కాకుండా నిజ జీవితంలోనూ వారి మధ్య ఉండే కెమిస్ట్రీకి ఎంతో మంది అభిమానులు ఉన్నారు. తాజాగా, ఈ జంటకు సంబంధించిన ఒక సరదా సంఘటన సోషల్ మీడియాలో మరోసారి చక్కర్లు కొడుతోంది. పార్టీ మధ్యలో భర్త రణ్‌వీర్ ప్యాంట్ చినిగిపోతే, దీపిక స్వయంగా సూది, దారం పట్టుకుని కుట్లు వేసిన ఆసక్తికరమైన విషయాన్ని ఆమె గతంలో వెల్లడించారు.'ది కపిల్ శర్మ షో'కు హాజరైనప్పుడు దీపిక ఈ సంఘటనను గుర్తుచేసుకున్నారు. తామిద్దరం బార్సిలోనాలో ఒక మ్యూజిక్ ఫెస్టివల్‌కు వెళ్లామని, అక్కడ రణ్‌వీర్ తన సహజమైన ఎనర్జీతో డ్యాన్స్ చేస్తున్నాడని తెలిపారు. "ఆ సమయంలో అతను చాలా లూజ్‌గా ఉన్న ప్యాంట్ వేసుకున్నాడు. ఏదో వెరైటీ స్టెప్ వేస్తూ డ్యాన్స్ చేస్తున్నాడు. అంతలోనే ఒక్కసారిగా అది 'ఫట్' మని చప్పుడొచ్చి చిరిగిపోయింది" అని దీపిక నవ్వుతూ చెప్పారు.వెంటనే స్పందించిన దీపిక, తన బ్యాగ్ నుంచి సూది, దారం బయటకు తీసి అక్కడికక్కడే కుట్లు వేయడం ప్రారంభించానని తెలిపారు. "నేను 'ఒక్క నిమిషం ఆగు' అని చెప్పి, నా బ్యాగ్ నుంచి సూది, దారం తీశాను. చుట్టూ ఉన్నవాళ్లంతా డ్యాన్స్‌తో ఎంజాయ్ చేస్తుంటే, నేను మాత్రం ఆ పార్టీ మధ్యలో అతని ప్యాంట్‌కు కుట్లు వేస్తున్నాను" అని ఆ ఫన్నీ ఇన్సిడెంట్‌ను ఆమె వివరించారు. ఈ సంఘటన వారి మధ్య ఉన్న అన్యోన్యతకు, దీపిక సమయస్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తుంది.

మా నాన్న అందగాడు కావడం మా తాతయ్యకు నచ్చలేదు

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ తన కుటుంబానికి సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన, వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు. ప్రముఖ రియాలిటీ షో 'బిగ్ బాస్ 20' వీకెండ్ కా వార్ ఎపిసోడ్‌లో ఆయన తన తల్లిదండ్రులు సుశీలా చరక్ (సల్మా ఖాన్), సలీం ఖాన్ ల వివాహం నాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. వారి పెళ్లికి తన తాతయ్య (తల్లి సుశీలా తండ్రి) ఎందుకు వ్యతిరేకత తెలిపారనే అసలు కారణాన్ని సల్మాన్ బయటపెట్టారు.



లాస్ ఏంజెల్స్ మ్యూజియంలో రామాయణ ప్రీమియర్

రణ్‌బీర్ కపూర్, యశ్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'రామాయణ' చిత్రం(వరల్డ్ ప్రీమియర్‌కు(సిద్ధమవుతోంది. 2026 అక్టోబర్ 27 సాయంత్రం లాస్ ఏంజెల్స్‌లోని అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లో ఉన్న డేవిడ్ గెఫెన్ థియేటర్‌లో ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్ జరగనుంది. సినిమాను 3డీ వెర్షన్‌లో ప్రదర్శించనున్నారు. అకాడమీ మ్యూజియం చలనచిత్ర చరిత్ర, కళ, సాంకేతికతకు అంకితమైన ప్రముఖ సంస్థ.గతంలో ఎన్నో అంతర్జాతీయ కార్యక్రమాలకు, ఆస్కార్‌కు సంబంధించి వేడుకలకు ఈ మ్యూజియం వేదికైంది. ఇప్పుడు 'రామాయణ' ప్రీమియర్ అక్కడ జరగనుండటం ఈ చిత్రబృందానికి ఒక ముఖ్య ఘట్టంగా నిలువనుంది. భారతీయ ఇతిహాసాన్ని అంతర్జాతీయ ప్రేక్షకులకు పరిచయం చేసే దిశగా ఇది కీలక ముందడుగు కానుంది. నితేశ్ తివారీ దర్శకత్వంలో ఈ



సినిమాను ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డీఎన్ఈజీ, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి.దీనికి హాన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ సినిమా హిందీ, తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలి భాగం ఇదే ఏడాది నవంబర్ 5న విడుదల కానుంది. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

భక్తి విశ్వాసాల కనకదుర్గ



అల్లరి నరేశ్(, కాజల్ చౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కొత్త సినిమా 'కనకదుర్గ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి బీవీఎస్ రవి కథను అందించారు. బిర్లా స్టూడియోస్, టెంపుల్ టౌన్ పిక్చర్స్ పతాకాలపై అజిత్ ఠాకూర్, బీవీఎస్ రవి నిర్మిస్తున్నారు. శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఈ చిత్రం నుంచి తొలి పాట 'అమ్మ కనకదుర్గ'ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటను తమన్ స్వరపర్చగా, సిరాశ్రీ సాహిత్యం అందించారు.ఈ గీతావిష్కరణ కార్యక్రమంలో హీరో అల్లరి నరేశ్ మాట్లాడుతూ.. "నేను తొలిసారి ఈ భక్తిరస చిత్రంలో నటిస్తున్నా. సినిమా షూటింగ్ పూర్తయింది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సిద్ధం చేస్తున్నాం" అన్నారు. నిర్మాతలు అజిత్ ఠాకూర్, బీవీఎస్ రవి మాట్లాడుతూ.. "భక్తి విశ్వాసాల నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పాట విడుదల ఒక అర్థవంతమైన తొలి అడుగు" అని చెప్పారు.సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ.. "ఈ పాట కేవలం ఓ సంగీత రచనలా కాకుండా.. భక్తుడు అమ్మవారిని ప్రార్థించే సమయంలో కలిగే గాఢమైన భావోద్వేగాన్ని, అమ్మవారి అపారమైన శక్తిని, కరుణను ప్రతిబింబించేలా ఉండాలని కోరుకున్నా" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిర్లా స్టూడియోస్ సహ నిర్మాత సునీల్ చైనాని, జీ మ్యూజిక్ కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సుజల్ పరేఖ్ పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.